క్లుప్తంగా

సీసీ రోడ్ల పనులు ప్రారంభం


చిన్నబెల్లాల్‌లో ప్రారంభిస్తున్న వెంకటేశ్

కడెం: మండలంలోని చిన్నబెల్లాల్ గ్రామంలో శనివారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.12 లక్షలతో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు గొళ్ల వెంకటేశ్ ప్రారంభించారు. నాయకులు సొదాని రాజన్న తదితరులు ఉన్నారు.

సార్పూర్(జి): మండలంలోని రాంపూర్ అనుబంధ గ్రామాలైన దర్యాపూర్, నసీరాబాద్, చర్లపల్లి గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.25 లక్షలతో సీసీ రోడ్డు పనులను బీజేపీ మండల అధ్యక్షుడు అర్జున్ ఠాకూర్ ప్రారంభించారు. పనులు పారదర్శకంగా చేపడుతామన్నారు. పంచాయతీ కార్యదర్శి నవనీత్ కుమార్ ఉన్నారు.

ఖానాపూర్: గోసంపల్లె గ్రామంలో సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులను ప్రారంభించారు. గ్రామస్తులు పంతులు నాయక్, టేకు గంగారాం, అమంద స్వామి, కిషన్‌నాయక్, ఉపాలి, కరిపె రాజేశ్వర్, బోడిగ సంతోష్, శోభన్, తుదిగేని రాజశేఖర్ ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై భీంరావు

కడెం: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఏఎస్సై భీంరావు అన్నారు. మండల కేంద్రంలో వాహనదారులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. లైసెన్స్, వాహన ధ్రువపత్రాలు తమ వెంట తెచ్చుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఇందులో పోలీసు సిబ్బంది ఉన్నారు.

మోడ్రన్‌గా వైకుంఠధామం


పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని వైకుంఠధామాన్ని మోడ్రన్‌గా అభివృద్ధి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ తెలిపారు. జిల్లాకేంద్రంలోని వైకుంఠధామాన్ని కమిషనర్ సీవీఎన్ రాజుతో కలిసి శనివారం సందర్శించారు. నూతనంగా నిర్మించిన స్నానపు గదులు, టాయిలెట్స్‌ని పరిశీలించారు. దహన సంస్కారాలకు వచ్చేవారికి ఇబ్బంది తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కౌన్సిలర్ తులసి నర్సాగౌడ్, ఏఈ హరిభువన్, తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం


సన్మానిస్తున్న తల్లిదండ్రులు

నిర్మల్ రూరల్: మండలంలోని అక్కాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు కరుణను విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం సన్మానించారు. కరుణ ఇటీవల ఆరు నెలలు సెలవుపై విదేశాల్లో ఉండే తన కూతురి వద్దకు వెళ్లింది. విద్యార్థుల చదువు దెబ్బతినకుండా ఆమె సొంత డబ్బులతో ఓ విద్యావలంటీర్‌ను నియమించింది. విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడిన ఆమెను గ్రామస్తులు, పేరెంట్స్ సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్, ఉపాధ్యాయులు రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి


మాట్లాడుతున్న సీడీపీవో సరిత

ఖానాపూర్: అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించడంతోపాటు రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సీడీపీవో సరిత అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రాజెక్టు సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్రానికి వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. రెండు యాప్‌లలో ఎప్పటికప్పుడు బరువు, ఎత్తు నమోదు చేయాలన్నారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురైన అలేఖ్యకు అంగన్‌వాడీ టీచర్లు నివాళులర్పించారు. సూపర్‌వైజర్లు ఉన్నారు.

శ్రమించారు.. సాధించారు

- పట్టుదలతో చదివి సత్తాచాటిన యువకులు
- ప్రతిభ కనబర్చి..కొలువు కొట్టి

పట్టుదలతో పోటీపరీక్షలకు ప్రణాళికతో సిద్ధమైన ఆ యువకులు ప్రభుత్వ కొలువులు సాధించారు. అర్హత కలిగిన ప్రతి పోటీపరీక్షకు హాజరయ్యారు. ప్రణాళికాబద్ధంగా చదివి కొలువు కొట్టిన యువకులపై సాక్షి కథనం.




జక్కుల సునీత

సోన్: మండలంలోని న్యూ బొప్పారం వాసి జక్కుల సునీత ఇటీవల వెలువడిన గురుకుల పీజీటీ ఫలితాల్లో ప్రతిభ కనబర్చింది. బాసర జోన్‌లో సాంఘికశాస్త్ర విభాగంలో సత్తా చాటింది. బీసీ గురుకులంలో ఉద్యోగం సాధించిన ఆమెకు రాష్ట్రస్థాయిలో 103 ర్యాంక్, జిల్లాస్థాయిలో 2వ ర్యాంక్ వచ్చింది. భర్త అమృత్‌రాజ్, పదేళ్ల కుమారుడు ఉన్నాడు. గృహిణి అయిన ఆమె ఓపెన్ టెన్త్, ఇంటర్, డిగ్రీ పూర్తిచేసింది. తర్వాత ఓయూలో అర్థశాస్త్ర విభాగంలో పీజీ పూర్తి, పోటీ పరీక్షకు సిద్ధమవ్వడం, ఉద్యోగం సాధించడానికి భర్త ప్రోత్సాహమని చెబుతోంది. స్నేహితులు, కుటుంబ సభ్యులు సునీతను అభినందించారు.

మామడ: పొన్కల్ గ్రామానికి చెందిన ద్యాగల రమేశ్–రాజమణి దంపతుల కుమారుడు మనోజ్ గురుకులాల ఫలితాల్లో పీజీటీగా ఎంపికయ్యాడు. పొన్కల్‌లో టెన్త్ వరకు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్, డిగ్రీ, పీజీ తెలంగాణ యూనివర్సిటీలో, బీఈడీ హైదరాబాద్‌లో పూర్తిచేశాడు.పలు పరీక్షలకు హాజరైన ఎంపిక కాలేదు. ప్రణాళికబద్ధంగా చదివి సర్కారు కొలువు సాధించాడు.

నిరుత్సాహం చెందలేదు



మాది వ్యవసాయ కుటుంబం. ఉన్నత చదువు కోసం వెళ్లాలంటే ఆర్థికంగా ఇబ్బందిగా ఉండేది. పలు పోటీ పరీక్షలు రాసిన ఎంపికకాలేదు. నిరుత్సాహం చెందలేదు. గ్రామానికి చెందిన చిక్యాల హరీశ్‌కుమార్ ఆర్థిక ప్రోత్సాహంతో శిక్షణ తీసుకున్నా. ప్రణాళికబద్ధంగా చదివి కొలువు సాధించా.

– మనోజ్, పొన్కల్

బీఫార్మసీ పూర్తి.. లైబ్రేరియన్ కొలువు కొట్టి

జిల్లా కేంద్రంలోని గాయత్రిటౌన్‌షిప్‌కు చెందిన రిటైర్డ్ డిప్యూటీ తహసిల్దార్ ప్రకాశ్–లక్ష్మి దంపతుల కుమారుడు ప్రసాద్‌కుమార్ పది వరకు సరస్వతీ శిశుమందిర్‌లో చదివాడు. ఇంటర్ ఎస్‌బీఆర్ జూనియర్ కళాశాల, జేఎన్టీయూలో బీఫార్మసీ, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో బీఎల్ఐసీ పూర్తి చేశాడు. ప్రభుత్వ కొలువు సాధించాలనే లక్ష్యంతో ప్రణాళికతో చదివాడు. గురుకుల పోటీ పరీక్షలకు హాజరయ్యాడు. లైబ్రేరియన్ పోస్టుకు రాష్ట్రస్థాయిలో 34వ ర్యాంకు సాధించి ఎంపికయ్యాడు.

పట్టుదలతో చదివా



మామడ: అటవీశాఖ ఎఫ్‌బీవోగా ఎంపికై ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలంలో విధులు నిర్వహిస్తున్నా. అటు ఉద్యోగం చేస్తూనే పోటీ పరీక్షలకు సిద్ధమయ్యా. ఈ క్రమంలోనే గురుకుల పీజీటీ పరీక్షలో మ్యాథ్స్ ఎంపికయ్యా. ప్రిన్సిపాల్ రాజు ప్రోత్సాహంతో పట్టుదలతో చదివి ఉద్యోగం సాధించా.

– కుంట ముత్యం, పిప్రి, మండలం లోకేశ్వరం

కొలువే లక్ష్యంగా..



బీఫార్మసీ పూర్తి చేసినప్పటికి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో పోటీ పరీక్షలకు హాజరయ్యా. గురుకుల విద్యాలయంలో లైబ్రేరియన్ పోస్టుకు ఎంపికయ్యాను. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారు నిరాశకు లోనుకాకుండా ప్రణాళిక చదివితే కొలువు సాధించవచ్చు.

– ప్రసాద్‌కుమార్, నిర్మల్

ఆరోగ్య సంరక్షణపై దృష్టిపెట్టాలి

- ఎమ్మెల్యే రామారావుపటేల్


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

భైంసాటౌన్: మారుతున్న జీవనశైలితో చిన్న వయసులోనే వ్యాధులబారిన పడుతున్నారని, ఆరోగ్యకరమైన అలవాట్లతో మెరుగైన జీవనం పొందవచ్చని ఎమ్మెల్యే రామారావుపటేల్ అన్నారు. పట్టణంలోని గురుకృపా వొకేషనల్ జూనియర్ కళాశాలలో శనివారం 'హెల్తీ లైఫ్‌స్టైల్ వెల్‌నెస్ సమ్మిట్'కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆరోగ్య సంరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన ఉండాలని, ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం డాక్టర్ రాజేందర్, డయల్ యువర్ విలేజ్ ఫౌండర్ మెంబర్ రవి ప్రకాశ్ మైరెడ్డి మాట్లాడుతూ వివిధ ఆరోగ్య అలవాట్లపై వివరించారు. భైంసా డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, శారద ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షురాలు ముష్కం ప్రసన్నరాణి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ ముష్కం రామకృష్ణగౌడ్, పట్టణ సీఐ రాజారెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎంపీపీ అబ్దుల్ రజాక్, బి.గంగాధర్, తదితరులు ఉన్నారు.

మహిళలు ఆర్థిక సమృద్ధి సాధించాలి

స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకుల ద్వారా రుణాలు పొంది స్వయం ఉపాధి పొందాలని ఎమ్మెల్యే రామారావుపటేల్ అన్నారు. పట్టణంలోని గణేశ్‌నగర్ మున్నూరుకాపు సంఘ భవనంలో శనివారం యూనియన్ బ్యాంక్ భైంసా శాఖ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు రుణాల అందజేశారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్, ఉద్యోగులు, ఎంపీపీ అబుద్ రజాక్, మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, మున్నూరుకాపు సంఘం నాయకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

కుంటాల: గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే రామారావు పటేల్ పేర్కొన్నారు. మండలకేంద్రంతోపాటు కల్లూర్ గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణ పనులకు శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశలవారీగా సమస్యల పరిష్కరిస్తానని తెలిపారు. ఎంపీపీ ఆప్క గజ్జారాంయాదవ్, వైస్ ఎంపీపీ మౌనిక నవీన్, కోఆప్షన్ మెంబర్ గౌస్, ఎంపీటీసీ సుధాకర్, నాయకులు నర్సారెడ్డి, గుద్దేటి గంగాధర్, పిప్పెర వెంగళరావు, శేఖర్‌రావు, రమణారావు, తాటి శివ, సోమసత్తయ్య, చంద్రకాంత్ పటేల్, గజేందర్, రజినీకాంత్‌రావు, రాజన్న, ఇన్‌చార్జి హెచ్‌ఎం రతన్ కుమార్ పాల్గొన్నారు.

'అధిష్టానం టికెట్ కేటాయిస్తే పోటీ చేస్తా'


మాట్లాడుతున్న ఆత్రం సుగుణ

కుంటాల: కాంగ్రెస్ అధిష్టానం ఆదిలాబాద్ ఎంపీ టికెట్ కేటాయిస్తే పోటీ చేస్తానని మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు ఆత్రం సుగుణ తెలిపారు. మండలకేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ తరపున 1999లో ఉట్నూర్ జెడ్పీటీసీగా గెలుపొందానని గుర్తుచేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మానవ హక్కుల సంఘం కార్యదర్శిగా కొనసాగుతున్నానని తెలిపారు. రైతుల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని, ప్రశ్నించే గొంతుకగా పనిచేస్తానన్నారు. సమావేశంలో నాయకులు పోశెట్టి, బాపూరావు, జుట్టు దయాకర్, జుట్టు నరేందర్, జగన్,శివ, సాగర్, భాస్కర్ పాల్గొన్నారు.

కేసీఆర్ జన్మదిన వేడుకలు


కడెం: కేక్ కట్ చేస్తున్న చంద్రశేఖర్


దస్తురాబాద్: పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

కడెం: మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కడెంలోని హరిత రిసార్ట్స్‌లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జొన్నల చంద్రశేఖర్ కేక్ కట్ చేశారు. జెడ్పీ కోఆప్షన్ మెంబర్ రఫీక్ అహ్మద్, మండల మాజీ అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్‌యాదవ్, స్టీఫెన్, కలీం, చోటు, వేణుగోపాల్, రవి ఉన్నారు.

కుంటాల: మండలకేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు కేక్ కట్ చేసి ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేశారు. పార్టీ మండల కన్వీనర్ దత్తాద్రి, సర్పంచుల సంఘం మాజీ మండల కన్వీనర్ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

దస్తురాబాద్/పెంబి/ఖానాపూర్: కేసీఆర్ జన్మదిన వేడుకలు పురస్కరించుకొని దస్తురాబాద్, పీహెచ్‌సీ, ఖానాపూర్, పెంబి ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఖానాపూర్‌లో జగన్నాథ్‌రావు చౌరస్తా వద్ద కేక్ కట్ చేశారు. నాయకులు ఐలయ్య యాదవ్, నర్సయ్య, గోపి, శంకర్, గంగన్న, కమలాకర్, రాజగంగన్న తదితరులు ఉన్నారు.

ఆన్‌లైన్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ


సోన్: ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సోన్: రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో నిర్వహించిన సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో మండలంలోని పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని హెచ్‌ఎం ఆరాధన తెలిపారు. సిద్దులకుంట ఉన్నత పాఠశాలకు చెందిన 9వ విద్యార్థిని ఎం.స్పందన, కేజీబీవీ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని బి.సస్మిక రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ప్రతీ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఆన్‌లైన్ పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు.

లక్ష్మణచాంద: జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ పోటీలకు మండలం నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన మండల స్థాయి సైన్స్ టాలెంట్ పోటీల్లో మండలంలోని ఐదింటిలో ఒక్కో పాఠశాల నుంచి ఇద్దరు చొప్పున మొత్తం 10 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో పార్‌పెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని సంపూర్ణ 31 మార్కులతో ప్రథమ స్థానం, వడ్యాల్ విద్యార్థిని శృతిక 29 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచింది. గెలుపొందిన ఇద్దరు జిల్లా స్థాయిలో నిర్వహించే సైన్స్ పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు గంగ సురేష్ తెలిపారు. నిర్వాహకులు సురేష్ బాబు, లక్ష్మణచాంద ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

తానూరు: స్థానిక జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు మండల స్థాయి ఫిజికల్ సైన్స్ ప్రతిభ పోటీలు నిర్వహించారు. ఆయా జెడ్పీ పాఠశాలల 8, 9వ తరగతి విద్యార్థులు పాల్గొని ఆన్‌లైన్‌లో పరీక్ష రాశారు. ఇందులో ప్రథమ స్థానంలో కేజీబీవీ విద్యార్థిని ధనశ్రీ, ద్వితీయ స్థానంలో ఎల్వి జెడీ పాఠశాల విద్యార్థిని ఎస్.అఖిలా ప్రతిభ కనబర్చారు. వీరు ఈనెల 20న నిర్వహించే జిల్లాస్థాయి ప్రతిభ పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం సాయిబాబు తెలిపారు. సైన్స్ ఉపాధ్యాయులు వందన, సుజాత దేవి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నల్ మార్కుల పరిశీలన


సోన్: పరిశీలిస్తున్న అధికారులు

సోన్: మండలంలోని సిద్దులకుంట, మాదాపూర్ ఉన్నత పాఠశాలల్లో శనివారం పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులను విద్యాశాఖ అధికారుల పరిశీలించారు. హెచ్‌ఎం హరీశ్‌రెడ్డి ఉన్నారు.

తానూరు: జెడ్పీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల అంతర్గత మార్కులను పీజీ హెచ్‌ఎం బృందం సభ్యులు శనివారం పరిశీలించారు. విద్యార్థుల మార్కుల జాబితాను హెచ్‌ఎంకు అందజేశారు. సభ్యులు గీత, పోశెట్టి, నరేందర్‌రావు, హెచ్‌ఎం సాయిబాబు ఉన్నారు.

లోకేశ్వరం: పంచగుడి, కన్కపూర్, పిప్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను జిల్లా మూల్యాంకన బృందం సభ్యులు రమణారెడ్డి, రతన్‌కుమార్, శ్రీనివాసచారి సందర్శించారు. పదో తరగతి అంతర్గత మూల్యాంకనంపై పరిశీలించారు. హెచ్‌ఎంలు ఆశోక్, సుభాష్, ప్రభాకర్ ఉన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

ముధోల్: మండలంలోని తరోడా సమీపంలో గల అంబులెన్సులో గర్భిణి ప్రసవించింది. నందిగాం గ్రామానికి చెందిన ఐశ్వర్యకు శనివారం తెల్లవారుజాము పురిటినొప్పులు రావడంతో అంబులెన్స్ సిబ్బంది ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యన నొప్పులు ఎక్కువయ్యాయి. అంబులెన్సులో ప్రసవించి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. వారిని భైంసా ఏరియాస్పత్రికి తరలించినట్లు ఈఎంటీ పండరి, పైలట్ నస్రుల్లాఖాన్ తెలిపారు.

మండల అధ్యక్షులకు సన్మానం


సన్మానిస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

భైంసా: బీజేపీ నూతన మండల అధ్యక్షులుగా ఎన్నికైనవారిని ఎమ్మెల్యే రామారావు పటేల్ సన్మానించారు. భైంసాలో నిర్వహించిన కార్యక్రమంలో తానూరు మండల అధ్యక్షుడు యాతాలం చిన్నారెడ్డి, కుభీర్ మండల అధ్యక్షుడిగా నియమితులైన ఏషాల దత్తాద్రిని సత్కరించారు. మండలాల్లో పార్టీని బలోపేతం చేయాలన్నారు.

అక్రమ డిప్యూటేషన్లు రద్దుచేయాలి

నిర్మల్: జిల్లా విద్యాశాఖలో అక్రమంగా ఇచ్చిన డిప్యూటేషన్లు రద్దుచేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు నామత్కర్ నవీన్ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలో శనివారం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న వారిని ఓరల్ డిప్యూటేషన్‌పై పట్టణ ప్రాంతాలకు పంపారని ఆరోపించారు. డీఈఓ స్థాయిలోనే ఇవి ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. వీటిని వెంటనే రద్దు చేయాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సాయి, రాజేష్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

నిర్మల్ రూరల్: పల్సి ఉన్నత పాఠశాలలో విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యాయామ ఉపాధ్యాయుడు సాగర్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్సీ ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌నాయక్ ఒక ప్రకటన డిమాండ్ చేశారు. ఇలాంటి ఉపాధ్యాయుల కారణంగా విద్యార్థుల భవిష్యత్ నాశనం అవుతుందన్నారు. మరో ఉపాధ్యాయుడికి చెడు ఆలోచన రాకుండా ఉండాలంటే సాగర్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

'విద్యారంగంపై చిన్నచూపు'

ఖానాపూర్: రాష్ట్రప్రభుత్వం ఇటీవల ప్రకటించిన బడ్జెట్ కేటాయింపుల్లో విద్యారంగంపై చిన్నచూపు చూస్తోందని ఏబీవీపీ విభాగ్ ఎస్‌ఎఫ్‌ఎస్ కన్వీనర్ చంద్రగిరి శివ అన్నారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యారంగానికి బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలన్నారు. ప్రభుత్వానికి విద్యపట్ల ఉన్న నిర్లక్ష్య వైఖరిని బడ్జెట్ కేటాయింపుల ద్వారా తెలియజేస్తుందన్నారు. సమావేశంలో దుర్గప్రసాద్, శ్రీకర్, మధుకర్, నితిన్, సంతోష్ ఉన్నారు.

పరామర్శ

ముధోల్: మండల కేంద్రంలోని కోలిగల్లీకి చెందిన కోరసాయి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఎమ్మెల్యే రాంరావుపాటిల్ శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న, మాజీ ఉప సర్పంచ్ మోహన్‌యాదవ్ ఉన్నారు.

లోకేశ్వరం: మండలంలోని అబ్దుల్లాపూర్‌లో భూమన్న కుమార్తె తేజశ్రీ, బిలోలి గ్రామానికి ఉపసర్పంచ్ భోజన్న తండ్రి ముత్తన్న ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. శని వారం బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే రామారావు పటేల్ పరామర్శించారు. బీజేపీ నాయకులు వట్టోలి సాయన్న, మంద భాస్కర్, విలాస్, ఈరన్న, రవీందర్‌రావు, అబ్దుల్లాపూర్ భోజన్న, మహేందర్‌రెడ్డి, మంద గణేశ్ ఉన్నారు.

అల్పాహారం అందించాలి

ఖానాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులకు సాయంత్రం ప్రత్యేక తరగతుల దృష్ట్యా వారికి అల్పాహారం అందించాలని తల్లిదండ్రులు కోరారు. మండలంలోని మస్కాపూర్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం జరిగిన ఎస్‌ఎంసీ సమావేశానికి హాజరై మాట్లాడారు. అల్పాహారం విషయమై జిల్లా కలెక్టర్‌కు విన్నవిస్తామన్నారు. హెచ్‌ఎం నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు జాడి శ్రీనివాస్, నరేందర్ ఉన్నారు.

ఎంపీడీవోకు సన్మానం

సారంగాపూర్: మండలానికి నూతనంగా బదిలీపై వచ్చిన ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రావును బీజేపీ నాయకులు, దివ్యాంగుల సంఘం నాయకులు శనివారం సన్మానించారు. బీజేపీ నాయకులు గంగారెడ్డి, కొరిపెల్లి రాజు, వీరయ్య, చెన్ను రాజేశ్వర్, మధు, చంద్రప్రకాశ్‌గౌడ్, ఎల్లయ్య, రాజేశ్వర్, సాగర్‌రెడ్డి, సాహెబ్‌రావు, దివ్యాంగుల సంఘం నాయకులు సురేందర్, చౌహాన్ ప్రకాశ్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

ముధోల్: మండలంలోని పిప్రి గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావుపాటిల్ వారికి కండువా కప్పారు. మాజీ ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావుపాటిల్, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శంకర్ చంద్రే, ముత్యంరెడ్డి, ముధోల్ మండల ఇన్‌చార్జి రావుల గంగారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఆత్మస్వరూప్ ఉన్నారు.

సన్మానం

పెంబి: మండలంలోని మందపల్లి మాజీ సర్పంచ్ చెరుపూరి సుధాకర్‌ని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శనివారం సన్మానించారు. సర్పంచ్‌గా ఆయన అందించిన సేవలను కొనియాడారు. ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రాజేశ్వర్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు వెంకన్న, పంచాయతీ కార్యదర్శి సుజాత, విద్యార్థుల తలిదండ్రులు ఉన్నారు.

'గృహజ్యోతి'కి దరఖాస్తు చేసుకోండి

కడెం: గృహజ్యోతి ఉచిత విద్యుత్ పథకానికి ఈనెల 19 లోగా దరఖాస్తు చేసుకోవాలని ఏఈఈ సుమన్‌కుమార్ పేర్కొన్నారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్నామని, అర్హులైన వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, ప్రజాపాలన రసీదు, ఫోన్ నంబర్లు ఇవ్వాలన్నారు.

'విబేధాలు సృష్టించేందుకే దుష్ప్రచారం'

ఖానాపూర్: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీజేపీ నేతల మధ్య విబేధాలు సృష్టించేందుకు వివిధ పార్టీల నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ పేర్కొన్నారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వారి కుట్రలను పార్టీ శ్రేణులు తిప్పికొట్టాలన్నారు. ఎంపీ సోయం బాపూరావుపై తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదన్నారు. తన వ్యాఖ్యలను కొందరు వక్రీకరించి దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా అధిష్టానం ఎవరిని ప్రకటించినా కలిసికట్టుగా పనిచేసి గెలిపించుకుంటామన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ముధోల్: మండలంలోని రాంటెక్, మచ్కల్, ముద్గల్, న్యూముద్గల్ గ్రామాల్లో శనివారం పలు అభివృద్ధి పనులను మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావుపాటిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తోందన్నారు. కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శంకర్ చంద్రే, ముత్యంరెడ్డి, ముధోల్ మండల ఇన్‌చార్జి రావుల గంగారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఆత్మ స్వరూప్, నాయకులు ప్రేమ్‌నాథ్‌రెడ్డి, కిషన్‌పతంగే, కిషన్ పటేల్, ఎం.ఏ అజీజ్, భుజంగరావు పటేల్, కేర్బా, వెంకటేశ్ ఉన్నారు.

కరాటే గ్రేడింగ్ పరీక్షలో ప్రతిభ

ముధోల్: మండల కేంద్రంలోని అక్షర పాఠశాల విద్యార్థులు జేకేఏఐ కరాటే గ్రేడింగ్ పరీక్షలో ప్రతిభ కనబర్చి రెడ్ బెల్టు సాధించినట్లు డైరెక్టర్ సుభాష్ తెలిపారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

క్రీడాసామగ్రి పంపిణీ

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్‌తండా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శనివారం సెంటర్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అందించిన క్రీడా సామగ్రిని తహసీల్దార్ జానకి పంపిణీ చేశారు. స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమన్నారు. ఎంపీవో నసీరుద్దీన్, ఆర్‌ఐ దేవిక, ఏపీవో ప్రమీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

కుభీర్: మండలప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తూము లక్ష్మీబాయి అధ్యక్షతన శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. అధికారులు శాఖల పనితీరుపై సభలో ప్రస్తావించారు. ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ ఎం.సోము, మండల ఉపాధ్యక్షుడు మోహినొద్దిన్, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

అంబేద్కర్ చౌరస్తాగా నామకరణం చేయాలి

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని మినీ ట్యాంక్‌బండ్ వద్ద గల చౌరస్తాకు అంబేద్కర్ చౌరస్తాగా నామకరణం చేయాలని అంబేద్కర్ యువజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఈ చౌరస్తాకు అంబేద్కర్ చౌరస్తాగా నామకరణం చేస్తామన్న హామీని అమలు చేయాలన్నారు. లేకపోతే ఆందోళనలు చేపడుతామన్నారు.

పోషకులకు సమావేశం

ముధోల్: మండల కేంద్రంలోని శ్రీసరస్వతీ శిశుమందిర్‌లో శనివారం పదో తరగతి విద్యార్థుల పోషకులకు సమావేశం నిర్వహించారు. విభాగ్ కార్యదర్శి కట్ట నాగచారి, జిల్లా కోశాధికారి సుదర్శన్ హాజరయ్యారు. సమావేశంలో విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ తదితర వాటిపై చర్చించారు. పాఠశాల కార్యదర్శి కంది మానాజీ, ప్రధానాచార్యులు సారథి రాజు, ఆచార్యులు ఉన్నారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీమంత్రి

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని హరిహరక్షేత్ర ఆలయ గురుస్వామి మూర్తి సతీమణి రాజ్యలక్ష్మి శనివారం మృతిచెందారు. అంత్యక్రియల్లో మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, గండి రామన్న ఆలయ చైర్మన్ లక్కడి జగన్మోహన్‌రెడ్డి, పాకాల ఫౌండేషన్ చైర్మన్ రాంచందర్ తదితరులు ఉన్నారు.

వైభవంగా పల్లకిసేవ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవరకోట దేవస్థానంలో శనివారం వైభవంగా పల్లకిసేవ నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవతో పూజా కార్యక్రమాలు చేపట్టి, వివిధ రకాల పూలతో అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆమెడ శ్రీధర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.